నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
శనివారం | 18 మే 2024 | www.navatelangana.com

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

వేద పండితులు రాజపున్నయ్య శర్మ
నవ తెలంగాణ-మిరుదొడ్డి



ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వేద పండితులు రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర శర్మలు తెలిపారు. మండల కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ దేవాలయ 8వ వార్షికోత్సవ వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, పుష్పాలంకరణ, దీపారాధన కుంకుమార్చన వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మంగళ హారతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొంటాం. ఎవరు అధైర్య పడొద్దు

రైతులకు కొండంత ధైర్యం నింపిన అధికారి
జిల్లా సివిల్ సప్లై అధికారి తనుజ
నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొంటాం, ఏ ఒక్క రైతు అధైర్య పడవద్దని జిల్లా పౌరసరఫల శాఖ అధికారి తనుజ అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం జాలిగామలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ధాన్యం తడిసిందని ఎవరు అధైర్య పడవద్దని, ప్రతి గింజ కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రోహిణి కార్తీ సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరు ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త పడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని జిల్లా అధికారులైన తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల కోసం ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరించడంలో ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

యాదవ మహాసభ ఉపాధ్యక్షులు వనం సంతోష్ యాదవ్
నవతెలంగాణ-మర్కుక్



గత ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లను అందిస్తారనే ఆశతో డీడీలు కట్టిన లబ్ధిదారులకు వెంటనే గొర్రెల యూనిట్లను మంజూరు చేసి ఆదుకోవాలని యాదవ మహాసభ మర్కుక్ మండల ఉపాధ్యక్షులు వనం సంతోష్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ గొర్రెల యూనిట్లు మంజూరు అవుతాయని ఆశతో వేలాది రూపాయల అప్పులు చేసి డీడీలు తీసి ప్రభుత్వానికి అందించడం జరిగిందని ఆయన తెలిపారు. గత శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ యధావిధిగా గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లు అందించడం జరుగుతుందని చెప్పి ఇప్పుడు డీడీలు వాపస్ ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల అనంతరం మరో మాట మాట్లాడటం పట్ల గొల్ల కురుమ యాదవ ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లను అందించకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంతోష్ యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మర్కుక్ మండలంలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం 161 డీడీలు తీశామని ఇందులో గత ప్రభుత్వం 41 మందికి గొర్రెలు పంపిణీ చేసిందని, ఇంకా 120 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏమి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం డీడీలు తీసి ఉన్న వారికి గొర్రెలు పంపిణీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

అభయజ్యోతి మానసిక వికలాంగులకు అన్నదానం

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో ఇంగు రమ రమేష్‌ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో అభయజ్యోతి మానసిక వికలాంగుల విద్యాలయంలో అన్నదానం నిర్వహించినట్లు అధ్యక్షురాలు వాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కిరాణా సరుకులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షిత, ఉపాధ్యాయుడు జోజి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మెరుగైన సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్న ప్రభుత్వం
మండల విద్యాధికారి ప్రభుదాస్



నవ తెలంగాణ-మిరుదొడ్డి

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల విద్యాధికారి ప్రభుదాస్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండల వనరుల కేంద్రంలో మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండలాలలోని 54 పాఠశాలలో చదువుతున్న 3,614 మంది విద్యార్థులకు 18,103 రాత పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం రోజైన జూన్ 12న విద్యార్థులకు అందజేస్తామన్నారు. సర్కార్ బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక పనులు పూర్తి చేయాలి


రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సిద్దిపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపద్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు మంచి పురోగతి సాధించారని, దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేసి కనీస మౌలిక వస్తువుల పనులు గ్రౌండ్ చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలలను పున: ప్రారంభించేందుకు మనకు మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఉన్నప్పటికీ రికార్డు సమయంలో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాల్సి ఉందని, వీటిని సత్వరమే కొనుగోలు చేయాలని అన్నారు. 5 రోజులపాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సీఎస్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో... ఎన్నికల ముచ్చట్లు



- త్వరలో వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారంటూ ప్రచారం
- ఆగస్టు 10 లోపు పంచాయతీ ఎన్నికలంటూ చర్చ
- సర్పంచ్ రిజర్వేషన్లు మారుతాయనే టాక్
- అధికార పార్టీలో గెలుపు గుర్రాల కోసం వేట
- స్థానిక సంస్థల్లో పట్టు బిగించే దిశగా ప్రభుత్వం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్లమెంట్ ఎన్నికలొచ్చాయి. ఫలితాలు రాకముందే గ్రామ పంచాయతీ ఎన్నికల గురించి ముచ్చట్లు మొదలయ్యాయి. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు పాలక వర్గాల్లేవు. ఇంచార్జీల పాలన సాగుతోంది. రెండు నెలల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవి కాలం ముగియనుంది. ఆగస్టు తర్వాత మున్సిపల్ పాలక వర్గాల పదవి కూడా ముగుస్తుంది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయనే చర్చ మొదలైంది. అధికార పార్టీల నేతల లీకేజీలతో సోషల్ మీడియాలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్, ఎన్నికలంటూ కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. మరో పక్క గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డుల రిజర్వేషన్లు మారుతాయంటూ ఊర్లల్లో చర్చోప చర్చలు నడుస్తున్నాయి. అధికార పార్టీ గెలుపు గుర్రాల వేటలో పడింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రజల్ని అంటుపెట్టుకుని పనిచేసే వాళ్లకే స్థానిక సంస్థ ఎన్నికల్లో అవకాశాలుంటాయని ప్రకటించడంతో ఆ పనిలో కాంగ్రెస్ నాయకత్వం నిమగ్నమైంది.

జిల్లా	గ్రామ పంచాయతీలు
మెదక్	469
సంగారెడ్డి	647
సిద్దిపేట	499

ఆగస్టు 10 లోపు పంచాయతీ ఎన్నికలు..?

గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవి కాలం ముగిసింది. ఆగస్టు 2 లోపు ఎన్నికలు జరపాలి. అప్పటి వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవి కాలం కూడా ముగియనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు జరిపే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా అనేక సమాచారాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వ పెద్దల నుంచి వస్తున్న లీకులను బట్టి గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలోనే రావచ్చనే చర్చ గ్రామాల్లో జరుగుతుంది. జూన్ మొదటి వారంలో ఆయా గ్రామ పంచాయతీల్లో వార్డుల విభజన ప్రక్రియ చేపడతారంటున్నారు. రెండో వారంలో రిజర్వేషన్ల ఖరారు చేస్తారంటున్నారు. మూడో వారంలో సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. జులై మొదటి వారంలో షెడ్యూల్, చివరి వారంలో నోటిఫికేషన్ జారీ కావచ్చని తెలుస్తోంది. ఆగస్టు 2 లోపు ఎన్నికల్ని నిర్వహించే అవకాశముంది. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజున పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ముగుస్తుంది. ఆ తర్వాత 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేసి ఉప సర్పంచ్ ఎన్నికను కూడా అదే రోజు పూర్తి చేస్తారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

స్థానిక సంస్థల్లో పట్టు కోసం ప్రయత్నం

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలని చూస్తుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో జోష్‌లో ఉండే కాంగ్రెస్ గ్రామ పంచాయతీల్లోనూ పాగా వేయాలని పావులు కదుపుతోంది. వెంట వెంట ఎన్నికలు జరపడం ద్వారా కొన్ని పథకాల అమలుకు సమయం కూడా లభిస్తుంది. అందుకే సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వం మొగ్గు చూపుతుందని చెబుతున్నారు. మెదక్ జిల్లాలో 469, సంగారెడ్డి జిల్లాలో 647, సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో 9 శాతం సర్పంచ్‌లు బీఆర్ఎస్ వెనకాల ఉండేది. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం కోల్పోయాక చాలా మంది కాంగ్రెస్ వైపు మళ్లారు. కానీ..! కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజల చేత ఎన్నుకోవడం ద్వారా స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి పట్టు పెరుగుతుంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి సైతం స్థానిక సంస్థల్లో కష్టపడి పనిచేసే వాళ్లకు గుర్తింపు ఉంటదని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసే వాళ్లను గుర్తించి ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు,

మంత్రులు తమ నియోజకవర్గాల్లో ఆయా గ్రామ పంచాయతీల వారిగా ఎవరెవరు ఏఏ సామాజిక వర్గాల నుంచి పార్టీలో యాక్టీ నాయకులున్నారనేది లెక్కలేస్తున్నారు. ఏ గ్రామంలో ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇస్తే పార్టీ గెలుస్తుందో అనేది కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకత్వం గ్రామాల్లో గెలుపు గుర్రాల వేటలో పడ్డారు. గతంలో ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు పోతే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు అవకాశముందా..? లేక గ్రామాల్లో పలుకుబడి ఉన్న నాయకుడికి అనుకూలమైన రిజర్వేషన్లు మార్చాల్నా అనేది చర్చ జరుగుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

మాకు పెళ్లాం పిల్లలు లేరా..
తహశీల్దార్ వ్యాఖ్యలతో రెచ్చి పోయిన రైతులు

- వారం రోజులుగా నిలిచి పోయిన ధాన్యం రవాణా
- మిన్‌పూర్ వద్ద రెండు గంటల రాస్తారోకో
- మెదక్ బొడ్మట్ పల్లి రోడ్డుపై భారీగా నిలిచిన వాహనాలు
- రైతులకు క్షమాపణ చెప్పిన తహశీల్దార్





నవతెలంగాణ-పాపన్నపేట

'మాకు పెళ్లాం పిల్లలు లేరా' మీ ఆందోళనల వద్దకు రావడానికి అంటూ పాపన్నపేట తహశీల్దార్ చేసిన నిర్లక్ష్యపు వ్యాఖ్యలతో వందలాది మంది రైతులు ఆవేదనకు గుయ్యారు. నిలిచి పోయిన ధాన్యం రవాణాను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాపన్నపేట మండలం మిన్ పూర్ వద్ద రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. దీంతో మెదక్-బొడ్మట్‌పల్లి రోడ్డుపై కిలో మీటర్ మేర వందలాది వాహనాలు నిలిచి పోయాయి. చివరకు తహశీల్దార్ లక్ష్మణ్ బాబు వచ్చి రైతులకు క్షమాపణ చెప్పి. ధాన్యం రవాణా వెంటనే ప్రారంభిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. పాపన్నపేట మండలం మిన్పూర్‌లో గత వారం రోజుల నుంచి రవాణా జరుగక పోవడంతో వందలాది క్వింటాళ్ల ధాన్యం సంచులు కల్లాల్లో పేరుకుపోయాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. అధికారులకు ఫోన్లు చేసినప్పటికీ, స్పందన రాక పోవడంతో మెదక్ బొడ్మట్ పల్లి రోడ్డుపై వందలాది మంది రైతులు రాస్తా రోకో చేస్తూ ఆందోళనకు దిగారు. స్థానికంగా ఉండకుండా, రైతుల సమస్యలు పట్టించుకోని ఎమ్మార్వోను సస్పెండ్ చేయాలని, తమ వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మొదట పాపన్నపేట ఏఎస్ఐ సంగన్న తన బలగాలతో వచ్చి నచ్చ చెప్పినప్పటికీ రైతులు వినలేదు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగడంతో కిలోమీటర్ మేర వాహనాలు పెద్ద ఎత్తున నిలిచి పోయాయి. డిగ్రీ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్తున్న తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. గంటన్నర తర్వాత సంఘటన స్థలికి వచ్చిన ఎస్సై నరేష్ ఎమ్మార్వోతో మాట్లాడటంతో ఆయన అక్కడికి వచ్చారు. మొదట రైతులకు క్షమాపణ చెప్పి, అనంతరం గంట వ్యవధిలో ధాన్యం రవాణ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.దీంతో రైతుల ఆందోళన విరమించారు. స్థానిక ఎంపీటిసి కుబేరుడు, మాజీ ఎంపీటిసి బిస్స గోపాల్, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, బాబర్ తో పాటు వందలాది రైతులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాల్సిందే

- ప్రభుత్వానికి నర్సింహుల పల్లి గ్రామస్తుల అల్టీమేటం
- గ్రామస్తులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-బెజ్జంకి

తమ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ వల్ల భవిష్యత్తులో ఎవరికి లాభాలు ఉంటాయో? ఎవరికి నష్టాలు ఉంటాయో? తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని. భవిష్యత్తు తరాల దృష్ట్యా పరిశ్రమ అనుమతులను రద్దు చేయాల్సిందేనని పరిశ్రమ వల్ల వాటిల్లే నష్టాలపై పూర్తి స్థాయిలో సందేహాలను నివృత్తి చేశాకే నిర్మాణ పనులు చేపట్టాలని మండల పరిధిలోని నర్సింహుల పల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామస్తుల సందేహాలను ప్రభుత్వాధికారులు, పరిశ్రమ యాజమాన్యాలు నివృత్తి చేయాల్సిన ఆవశ్యకత ఉండడంతో శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పరిశ్రమ యాజమాన్యంతో కలిసి నర్సింహులపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఇథనాల్ పరిశ్రమను రద్దంటే రద్దు చేయాల్సిందేనని పలువురు గ్రామస్తులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి మొర పెట్టుకున్నారు. ఇతర ప్రాంతాల్లో నిర్మించిన పరిశ్రమలను సందర్శించి సందేహాలను నివృత్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తామని, గ్రామస్తుల డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని అదనపు కలెక్టర్ హామీనిచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు. ఎంపీటీసీ కొలిపాక రాజు, తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ సుహాసిని, సూపరిండెంట్ అంజయ్య, అయా శాఖల అధికారులు, పలువురు గ్రామస్తులు హాజరయ్యారు.



కొల్చారంలో ఘోర రోడ్డు ప్రమాదం

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన కారు
నవతెలంగాణ-కొల్చారం



మండల కేంద్రమైన కొల్చారం పోలీస్ స్టేషన్ ముందు మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం గ్రామానికి చెందిన నిమ్మగల్ల దేవయ్య (55) పశువులకాడికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా అకస్మాత్తుగా మెదక్ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవయ్య కాలు తెగి వేరేచోట పడింది. అనంతరం రక్తపు మడుగులో పడి ఉన్న దేవయ్యను స్థానికులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య భూమమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమదారుడు విక్రయిస్తే చట్టరిత్యా తప్పు అని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు. శుక్రవారం బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 15 గంటల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ బియ్యం ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందితో గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అహ్మదీపూర్ శివారులో పట్టుకున్నామన్నారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అహ్మదిపూర్ గ్రామ శివారులో తోట ప్రవీణ్ తన ఆటో నెంబర్‌లో 15 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతన్ని పట్టుకొని విచారించగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిస్తున్నాడని నిర్ధారణ అయిందన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది, గజ్వేల్ పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారన్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలు, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసినా, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టినా రవాణా చేసిన చర్యలు తప్పవన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

సిద్దిపేట జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్
నవతెలంగాణ- సిద్దిపేట రూరల్



తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని సిద్దిపేట జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి జిల్లెల రమేష్ గౌడ్ అన్నారు. నారాయణరావుపేట మండలంలో పలు గ్రామాల్లో అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాలలో దాన్యం తడిసి వరదల్లో కొట్టుకపోయిందన్నారు. మరోవైపు కొంచెం తేమశాతం ఎక్కువగా ఉన్న మిల్లర్లు ధాన్యాన్ని తీసుకోవడం లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తర్వాత దాన్ని రంగు మారినా తీసుకునేందుకు ససేమీరా అంటున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉన్నత అధికారులతో నారాయణరావు పేట మండలంలోగల పలు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను సందర్శించాలన్నారు. వర్షాలకు తడిసి ధాన్యాన్ని నష్టపోయిన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి వెంటనే తడిసిన ధాన్యాన్ని ఎటువంటి కటింగు పెట్టకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు మునిగల స్వామి , భూమయ్య , ఎల్లం, కుమార్, ప్రతాప్ రెడ్డి, బిక్షపతి, సంపంగి, సుధాకర్, అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

నవతెలంగాణ-నంగునూరు : సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి కోనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసిపోయింది. రోజురోజుకూ ఓ ప్రాంతంలో వర్షాలు పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరబెట్టినా ధాన్యం తడవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షం ధాటికి నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. గాలి దుమారంతో కురిసిన వానతో తెంపేందుకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు నేలరాలాయి. గాలికి చెట్లు విరిగాయి. కూరగాయల పంటలకు కూడా నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం వల్ల ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై రెవిన్యూ, వ్యవసాయ అధికారులను వివరణ కోరగా శనివారం క్షేత్రస్థాయి పర్యటన చూసి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
శనివారం 18 మే 2024 www.navatelangana.com

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మునిపల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ మహబూబ్ అన్నారు. మేళాసంఘంలో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో గ్రామ కార్యదర్శి వాణితో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు, గ్రామీణ ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు,.కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. ప్రతి ఉపాధి హామీ కూలికి రూ.300 వచ్చే విధంగా కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని స్థలాలలో తగు జాగ్రత్తలతో పని చేయించాలన్నారు. పని స్థలంలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు, మండలంలోని ఉపాధి పనుల విషయంలో మేళాసంఘం ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మంత్రికి పోచమ్మ జాతర ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-పుల్కల్

మండలకేంద్రంలో రేపటి(ఆదివారం) నుంచి పోచమ్మ జాతర ప్రారంభం కానున్నది. ఈ జాతరకు హాజరుకావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయన నివాసంలో పుల్కల్ గ్రామస్తులు జాతర ఆహ్వాన పత్రికను శుక్రవారం అందజేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. 'నేను తప్పకుండా వస్తాను. అది నా ఊరు. కావున అందరూ ఐకమత్యంతో ఉండి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి' అని సూచించారు. కులమతాలు, పార్టీలకతీతంగా గ్రామస్తులంతా కలిసికట్టుగా ఉంటూ అభిషేకం, బోనాలు, అన్నదాన కార్యక్రమాలు జరపాలన్నారు.



సమయానికి బస్సులు రాక తిప్పలు

స్టాప్ ఉన్నా బస్సులు ఆపట్లేదు

అధికారులు దృష్టి సారించాలి : ప్రయాణికులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రజలకు ఇబ్బందులు తప్పట్లేదు. ఓ పక్క సమయానికి బస్సులు రాకపోవడం.. మరోపక్క బస్సులు వచ్చినా ఆపకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తర్వాత ఈ సమస్య మరింత ఎక్కువైందని పలువురు ఆరోపిస్తున్నారు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రావట్లేదని.. వచ్చిన బస్సులు కూడా స్టాప్ వద్ద ఆగట్లేదని ఆరోపిస్తున్నారు. ఇదేంటని డ్రైవర్, కండకర్టర్‌ను అడిగితే.. ఇప్పటికే బస్సు నిండుగా ఉన్నదని స్థలం లేదని చెబుతున్నారన్నారు. జహీరాబాద్ బీదర్ రోడ్డులోని మిర్జాపూర్ (బి), గంగ్వార్ చౌరస్తాలో ఈ సమస్య నిత్యకృత్యమైనది. ఈ దారుల్లో స్టాప్ వద్ద ప్రయాణికులు చేతులు పెట్టి ఆపినా.. బస్సులు ఆగట్లేదని పలువరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాంతో సమయానికి వెళ్లకపోవడంతో ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. బస్సులు సంఖ్య పెంచడంతో పాటు ప్రతీ స్టాప్‌లో ఆపేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మేమంటే మేమే గెలుస్తున్నాం..

మెదక్ ఎంపీ సీటుపై ఎవరికి వారే ధీమా



- తమ నాయకుడే గెలుస్తాడంటూ ఆయా పార్టీల కార్యకర్తల లెక్కలు

నవతెలంగాణ-జిన్నారం

గ్రామాల్లో రాజకీయ లెక్కల వ్యవహారం జోరందుకుంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిపోవడంతో రాజకీయ ఇప్పుడు ఎవరు గెలుస్తారన్నది సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా మొన్న ఎలక్షన్లు అయిపోయినయి.. ఎవరు గెలుస్తారో, కుర్చీ ఎవరు దక్కించుకుంటారో అనే చర్చలు ఊపందుకున్నాయి. ఈ తరుణంలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ అభ్యర్థి గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మొన్నటి ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మొత్తం ఏడు సెగ్మెంట్లలో పటాన్చెరు సెగ్మెంట్‌లోనే 63.01గా అతి తక్కువ పోలింగ్ నమోదయింది. అత్యధికంగా నర్సాపూర్ నియోజకవర్గంలో 84.25 పోలింగ్ నమోదయింది. పటాన్చెరు అసెంబ్లీ సెగ్మెంట్ పారిశ్రామిక ప్రాంతాలుగా విస్తరించడం, హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండడం విద్యరంగంలో అభివృద్ధి చెందిన ప్రాంతం కావడం ఇలాంటి అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నా.. పోలింగ్ శాతం మాత్రం తక్కువగా నమోదు కావడం గమనార్హం.

మెదక్ కుర్చీ మాదేనంటూ ధీమా..

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ నుంచి నీలం మధు ముదిరాజ్, బీఆర్ఎస్ నుంచి వెంకట్రామిరెడ్డి, బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్ రావు ప్రధానంగా బరిలో దిగిన విషయం విధితమే. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో సర్వశక్తులొడ్డీ తాము పనిచేశామని కింది స్థాయి నుంచి ఓటర్లను కదిలించడంలో తాము విజయం సాధించామని అన్ని పార్టీల నాయకులు ధీమాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తమ నాయకుడే గెలుస్తాడంటూ అన్ని పార్టీల కార్యకర్తలు, నాయకులు చెబుతున్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ.. ఎన్ఎంఆర్ సెంటర్‌గా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న యువకుడు, పటాన్చెరువు ప్రాంతం వాసి అయినా నీలం ముదు ముదిరాజ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. జిల్లా మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, ఇన్చార్జ్ మంత్రి కొండ సురేఖ, కాట శ్రీనివాస్ గౌడ్ బృందంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీలం మధుకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. రాహుల్ గాంధీ లాంటి అగ్రనాయకత్వం కూడా సభ నిర్వహించడంతో.. నీలం మధు గెలుపుపై కార్యకర్తల్లో జోష్ పెరిగింది. నీలం మధు సేవా కార్యక్రమాలతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కూడా ఉండడంతో పక్కాగా తమ నాయకుడే గెలుస్తాడంటూ కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మరోపక్క బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఐఏఎస్‌గా ఉన్నత సేవలు అందించడం, ఎమ్మెల్సీగా అనుభవం కలిగి ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం. మరోపక్క మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు విస్తృతస్థాయి ప్రచారం నిర్వహించి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. ప్రత్యేక రోడ్ షోలు నిర్వహించి కార్యకర్తల్లో జోష్ నింపారు. రాష్ట్ర ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకత, బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం, ఐఏఎస్‌గా అనుభవం ఉండడంతో.. ఆయన గెలుపు పక్కా అని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అలాగే బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు దుబ్బాక ఎమ్మెల్యేగా అనుభవం, విద్యావంతుడుగా అడ్వకేట్‌గా జనాలకు సుపరిచితం కావడం ఆయనకు కలిసొచ్చే అవకాశం. దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన నేపథ్యం గల ఆయనకు, ప్రచారంలో పదునైన వాగ్ధాటి, ఆకట్టుకునే మాట తీరు, మోడీ చరిష్మా వెన్నుదన్నుగా నిలుస్తుందని.. దాంతో తప్పనిసరిగా మెదక్ పార్లమెంట్ స్థానంపై పెద్ద మెజారిటీతో రఘునందన్‌రావు విజయం ఖాయమని బీజేపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇలా ఎవరికీ వారే విజయం పై ఆయా పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఉత్కంఠకు తెరపడాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.



గణేష్‌గడ్డ శ్రీ సిద్ధి గణపతి హుండీ లెక్కింపు

- 61 రోజులకు హుండీ ఆదాయం రూ.14,03,425

- అన్నదానం హుండీ ఆదాయం రూ.1,01,466

నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్ గడ్డలో స్వయంభుగా వెలిసిన శ్రీసిద్ధి గణపతి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీసిద్ధి గణపతి 61 రోజులకు సంబంధించి హుండీ ఆదాయం రూ.14,03,425, అలాగే అన్నదానం హుండీ ఆదాయం రూ.1,01,466 వచ్చినట్టు ఆలయ ఈఓ పి.మోహన్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ వి.శివరాజ్ సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్, అర్చకులు సంతోష్‌శర్మ, సతీష్‌శర్మ, అజయ్ శర్మ, జగదీశ్ స్వామి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో బొల్లారం మున్సిపాల్టీ వీలీనం?

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పటాన్‌చెరు నియోజకవర్గం రింగ్‌రోడ్డు లోపల గల మున్సిపాల్టీలు గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్‌జోన్‌లో త్వరలోనే విలీనం కానున్నట్టు ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పుల్లగూర్ల లక్ష్మారెడ్డి తెపారు. కాగా గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్‌జోన్‌లో కలిస్తే.. కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బొల్లారం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బోగస్ ఓట్లను తొలగించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో అధిక సంఖ్యలో బోగస్ ఓట్లు, గుర్తుతెలియని ఓట్లు ఉన్నాయని.. వాటిని తొలగించాలని స్థానికులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో నూతన ఓటర్ల అడ్రస్ సరిగా ఉన్నప్పటికీ.. పోలింగ్ బూత్‌లు మాత్రం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వచ్చాయన్నారు. అలాంటి వాటిని సరి చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు వీరేశం గౌడ్, నాగరాజు, బాలయ్య ,రాజు, గోపాల్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-మనూర్

మండలంలోని బాధల్గావ్ గ్రామానికి చెందిన గడ్డమిది విట్టల్ కుమారుల నూతన వస్త్రాలంకరణ వేడుక శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై.. చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వినోద్, లింగం, విజయకుమార్, నాసిరోద్దీన్ పటేల్, దోసపల్లి దత్తు, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

గత ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సమితి విభాగం ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు మారుతి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ డిక్లరేషన్ ప్రకారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు.

సాయుధ బలగాల పహారాలో కౌంటింగ్ కేంద్రం

- పరిశీలించిన రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్

నవతెలంగాణ-పటాన్‌చెరు

కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతరం సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి.. కేంద్రం గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్‌లతో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్ లలో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఓట్ల లెక్కింపు కేంద్రమైన రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన ఈవీఎంలు, సెక్యూరిటీ లాక్ బుక్ రిజిస్టర్స్‌లను, మూడు అంచెల సెక్యూరిటీ ఏర్పాటులను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లోటు పాట్లకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ సెక్యూరిటీ చర్యలు జిల్లా యంత్రాంగం చేపట్టినట్లు తెలిపారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సాయుధబలగాలతో పహారా ఏర్పాటు,ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నామన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ సీల్‌లను క్షుణ్ణంగా పరిశీ లిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్ట నున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధి కారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపో కల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాల న్నారు. విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్లకు అదనంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసినట్లు కౌంటింగ్ సెంట ర్లోజనరేటర్ ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ మనోజ్, కామారెడ్డి ట్రయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, నిమ్జ్ ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యువతే దేశానికి సంపద



నవతెలంగాణ-పటాన్‌చెరు

యువతే దేశానికి సంపద అని వారు దేశ సమగ్రత, సానుభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అన్నారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ రెండో పట్టాల ప్రదానోత్సవ (గ్రాడ్యుయేషన్ డే) వేడుకను శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెరా సెమినార్ హాలులో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ అకాడమిక్ ప్రొసెషన్లో ప్రారంభమైన ఈ వేడుక జాతీయ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో శ్రీకారం చుట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ లను అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. పబ్లిక్ పాలసీ యొక్క భవిష్యత్తును రూపొందించడంలో వారి పాత్ర, ప్రాముఖ్యతలను నొక్కి చెప్పారు. పబ్లిక్ పాలసీ ద్వారా న్యాయం, ధర్మం, ఉమ్మడి ప్రయోజనాలు కొనసా గిం చాలని, యువత తీసుకునే నిర్ణయాలు, వారు సమర్థించే విధానాలు, చర్యలు అసంఖ్యాక వ్యక్తుల జీవితాలపై తీవ్ర ప్రభావాలను కలిగి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. అం దరికీ హక్కులను కల్పించడంలో భారత రాజ్యాంగం యొక్క పాత్ర, వివిధ కార్యక్రమాల ద్వారా విభిన్న వ్యక్తులను భాగస్వాములను చేయడంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ వేస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా జస్టిస్ మిశ్రా ఉటంకించారు. అర్థవంతమైన, ఉద్దేశపూర్వక జీవితాన్ని గడపడం ద్వారా తాము పనిచేస్తున్న సంస్థ, తమ కుటుం బంతో పాటు మాతృదేశానికి కీర్తి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కౌటిల్యా డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ ముఖ్య అతిథిని పరిచయం చేశారు. గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు కేఎస్ పీపీ విద్యార్థి అర్చన గుప్తాకు ప్రతిజ్ఞను అందజేయగా, ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథి నుంచి పట్టాను అందుకున్న వారి పేర్లను కేఎస్ పీపీ డీన్ ప్రకటించారు. కాగా, గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ అధికారిక ధ్రువీకరణలపై ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సంతకం తీసుకున్నారు. ఈ పట్టాల ప్రదానోత్సవంలో 25 మంది కేఎస్ పీపీ విద్యార్థులు స్నాతకోత్తర (పీజీ) డిగ్రీలను, అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారు బంగారు పతకాలను అందుకున్నారు. యనమండ్ర మల్లికార్జునరావు బంగారు పతకాన్ని ప్రణీత పుల్లను రాజు, ప్రియా భట్కర్‌లు సంయుక్తంగా అందుకున్నారు. అంతర మైత్రా డీన్ అవార్డును అందు కుంది. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ మొదటి ర్యాంకర్‌గా ప్రణిత పుల్ల ంరాజు గీతం ప్రెసిడెంట్ పేరిట నెలకొల్పిన బంగారు పతకాన్ని అందుకున్నారు. తమ పిల్లలను వృత్తినిపుణులుగా తీర్చి దిద్దినందుకు తల్లిదండ్రులు కౌటిల్యా అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కేఎస్ పీపీ విద్యార్థి వినాయక శ్రీచైతన్య విద్యార్థులందరి తరపున తన స్పందనను తెలి పారు. కౌటిల్యా సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వల్ వందన సమర్పణతోపట్టాల ప్రదానోత్సవం ముగిసింది.

ఆసానికుంటను పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని ఆసానికుంట కబ్జా పై వివిధ పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఆసాని కుంటను శుక్రవారం పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బిక్షపతి, ఆర్ ఐ జయప్రకాష్ నారాయణ, సర్వేయర్ రామభద్రం, ఇరిగేషన్ అధికారులు మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, రెవెన్యూ ఆఫీసర్ శ్రీధర్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసానికుంట కబ్జాపై చర్యల్లో అలసత్వమెందుకు?

- ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పుల్లగూర్ల లక్ష్మారెడ్డి

ఆసానికుంట కబ్జాపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పుల్లగూర్ల లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికే రెండు సార్లు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కబ్జా గురైన ఆసానికుంట కబ్జాను సందర్శించి చూసి వెళ్లిన విషయం విధితమే. కాగా తాజాగా శుక్రవారం మరోమారు అధికారులు ఆసానికుంటను సందర్శించారు. ఈ నేపథ్యంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అధికారులు రావడం చూసి వెళ్లడం తప్పా.. చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎవరి ప్రమేయంతో కబ్జాను కాపాడుతున్నారని మండిపడ్డారు. అందులో కొంతమంది నాయకుల అండదండలతో ముడుపులు తీసుకుని నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఆసానికుంటను కబ్జా నుండి పరిరక్షించాలన్నారు. కబ్జా చేసిన ధర్షన్ అగర్వాల్ ఓ రీసైక్లింగ్, సెంట్రింగ్ రెండు పరిశ్రమలకి పన్నెండేండ్లుగా లీజుకు ఇచ్చారని.. ఆ పరిశ్రమల కు మున్సిపల్ నుంచి ఎలాంటి పన్నులు ఎందుకు వసూలు చేయలేదన్నారు. ఒక సామాన్యుడు అరవై గజాలు ఇంటికి పన్ను కట్టకపోతే ఆస్తిని జప్తు చేస్తారని.. అలాంటిది ఏకంగా ఓ పరిశ్రమలకి లీజుకు ఇచ్చారని దానిపై పన్నులు ఎందుకు వసూలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆసాని కుంట కబ్జా నుండి కాపాడాలని కోరారు.



రైతులను ఇబ్బంది పెట్టొద్దు



నవతెలంగాణ-పుల్కల్

ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టొద్దని డీసీఓ ఎస్.శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. అయితే ధాన్యాన్ని తీసుకువచ్చి 25 రోజులు గడుస్తున్నా.. నేటికీ ధాన్యాన్ని తూకం వేయట్లేదని పలువురు రైతులు డీసీఓ దృష్టికి తీసుకువచ్చారు. అంతకాకుండా వారం రోజుల క్రితం కోసి తీసుకువచ్చిన కొందరి వడ్లు తమ ముందే తూకం వేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచర్ వచ్చిన వడ్లను తూకం వేయకుండా.. వాళ్లకు అనకూలంగా ఉండే కొందరి వడ్లను రాత్రికి రాత్రే తూకం వేస్తున్నారని రైతులు చెప్పుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. ఈ విషయమై సహకారం సంఘం సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి అలా జరగకుండా ప్రతి రైతును సమానంగా చూసి వారి ధాన్యాన్ని తూకం వేయాలన్నారు. ఏ ఒక్క రైతును ఇబ్బంది పెట్టినా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. అంతేకాకుండా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఈఓ మునిరా బేగం తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదంటూ మండి పడ్డారు. ప్రతిరోజు కొనుగోలు కేంద్రానికి వచ్చి ధాన్యాన్ని పరిశీలిం చాలన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షిం చేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మునిర బేగం, సీఈవో నాగయ్య, సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





మంజీరా బ్యాక్ వాటర్‌లో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-రాయికోడ్

మండలంలోని సిరూర్ శివారు మంజీరా బ్యాక్ వాటర్‌లో శుక్రవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిరూర్ శివారులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద దొరికిన వివరాల ప్రకారం.. అతడు జహీరాబాద్ మండలం పస్తాపూర్ గ్రామానికి చెందిన తలారి రవికుమార్(50)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే మృతుడు కొంతకాలంగా ఫైల్స్ వ్యాధితో బాధపడుతున్నాడని.. అది ఎంతకూ తగ్గకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

త్రాగునీటి సంపు పనులను పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ మమత



నవతెలంగాణ - చేగుంట

చేగుంట మండలంలోని కర్నాల్ పల్లి ప్రాథమిక పాఠశాల తాగునీటి సంపు నిర్మాణం పనులను శుక్రవారం ఇరిగేషన్ ఏఈ మమత రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణల తో కలిసి పనులను పరిశీలించారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ చిట్టబోయిన సత్యనారాయణ పాఠశాలలో తాగునీటి సౌకర్యం కోసం సంపు నిర్మాణం పనులను చేపట్టాడు అధికారి మమతారెడ్డి పనులు పరిశీలించి పాఠశాలలో పలు వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. సంపు నిర్మాణం పనికి దొడ్డు కంకర, సన్న కంకర తో బెడ్డు పోసి దానిపైన రింగులు వేయాలని,ప్లాస్టరింగ్ బాగా చేయించి సంపు కట్టాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ చిట్టబోయిన సత్యనారాయణకు సూచించారు. పిల్లలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లు, గదుల రిపేరు, తరగతి గదులకు తలుపులు కిటికీలు, పాఠశాలకు అవసరమైన మరమ్మతులు పాఠశాల తెరిచేలోపు పనులు పూర్తి చేయించాలని సూచించారు. పాఠశాలలో పూర్తయిన పనులను ఓవర్ హెడ్ ట్యాంక్ ను, కరెంటు పనులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ చిట్టబోయిన సత్యనారాయణ, చైర్మన్ మాధవి, సరిత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదవశత్తు బస్సును ఢీకొన్న బైకు ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



నవ తెలంగాణ - హవేలీ ఘనపూర్

ప్రమాదవశాత్తు బస్సును ఢీకొన్న బైకు ఒకరు మృతి ఇద్దరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది.హవేలీ ఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తాండ వద్ద మెదక్ నుండి రామాయంపేట మెయిన్ రోడ్డుపై ముందు వెళుతున్న బస్సు ను వెనుక నుండి వచ్చిన బైకు ఢీకొట్టడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన పర్స శంకరయ్య 60 మృతి చెందాడు. మరో ఇద్దరు హవేలీ ఘనపూర్ మండలంలోని శమ్నా పూర్ గ్రామానికి చెందిన బుస సత్తయ్య, మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన తక్కెళ్ళ అంజయ్య లకు తీవ్ర గాయాలు కాగా మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

తూప్రాన్ మండలంలో ఆగని అక్రమ మట్టి దందా

- తైదలబండ వద్ద అక్రమంగా మట్టిని పోస్తున్న వ్యాపారులు

నవతెలంగాణ-మనోహరాబాద్



తూప్రాన్ మండలంలో రాత్రి మట్టి దందా ఆగడంలేదు. రాత్రి వేళల్లో అక్రమ మట్టి వ్యాపారులు చెలరేగిపోతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూమిలోనే వందల సంఖ్యలో టిప్పర్లతో మట్టిని తరలించారంటే అటు అధికారుల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని రోజులుగా మట్టిని తరలించి పోస్తున్నప్పటికి రెవెన్యూ అధికారులు కనీసం పరిశీలించిన దాఖలాలు కూడా లేవు. అది జాతీయ రహదారికి ఆనుకున్న స్థలంలోనే మట్టిని అక్రమ మట్టి వ్యాపారులు పోస్తున్నారు. తూప్రాన్ మండలం తైదలబండ వద్ద ఉన్న స్థలంలో పెద్ద ఎత్తున అక్రమ మట్టిని వ్యాపారులు పోస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా అక్రమ మట్టి వ్యాపారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి అక్రమ మట్టి వ్యాపారం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీబీ పాటిల్ విజయం ఖాయం

- మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ విజయం ఖాయమని పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీకి మంచి ఆదరణ లభిస్తుందని 400 పైగా పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంటుందన్నారు. బీబీ పాటిల్ గెలుపు కోసం కృషి చేసిన బీజేపీ కార్యకర్తలు నాయకులు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు ఎంపిటిసి దామోదర్ మాజీ సర్పంచులు సూర్య ప్రకాష్ అశోక్ శ్రావణ్ కుమార్, మంగళ కృష్ణ, ఎర్ర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ - హవేలీ ఘనపూర్

హవేలీ ఘనపూర్ మండలంలోని నాగపూర్, హవేలీ ఘనపూర్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని మెదక్ ఏ డి ఏ మోహన్ బాబు శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నాగపూర్, హవేలీ ఘనపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరమ్మత్తులు జరుగుతాయని తెలిపారు.ఈ గ్రామాల పరిధిలోని రైతులు, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించగలరని ఏడిఏ మోహన్ బాబు కోరారు.

సాదాసీదాగా మండల సర్వసర సమావేశం



నవతెలంగాణ -పాపన్నపేట

మండల కేంద్రంలో ఎంపీపీ చందన ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీపీ సూచించారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వర్షాలు పడుతున్న సందర్భంగా విద్యుత్ అధికారులు ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పాపన్నపేట ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్ సభ ద్వారా కోరారు. డిప్యూటేషన్ల పై వివిధ మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరం నుంచి స్థానికంగానే విధులు నిర్వహిస్తారని మండల విద్యాధికారి నీలకంఠం ఎంపీపీకి తెలియజేశారు. కాగా సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఆర్ అండ్ బి, ఎక్సైజ్, అటవీ శాఖల అధికారులు సహ పలు శాఖలు గైర్హాజరైన వారిలో ఉన్నారు. ప్రస్తుత పాలకవర్గానికి దాదాపు ఇదే సమావేశం చివరిది కావడంతో ఐదేళ్లపాటు మండల అభివృద్ధికి సహకరించిన ఎంపీటీసీలకు, ఇతర ప్రజా ప్రతినిధులకు ,పలు శాఖల అధికారులకు ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గౌస్ పాషా, ఎంపీటీసీలు ఆకుల శ్రీనివాస్, రమేష్ గౌడ్, బాలమణి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రఘునందన్ రావు గెలుపు ఖాయం

- బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు



- జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

నవతెలంగాణ - మెదక్

మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని, కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల పాటు కార్యకర్తలు అవిశ్రాంతంగా కష్టపడడం వల్ల మంచి రిజల్ట్స్ రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్లో ఉన్నటువంటి ఏడు నియోజకవర్గాల్లో భారీ మెజార్టీతో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలువబోతున్నారనే విషయం స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. కార్యకర్తల కృషి వలన భారీ మెజార్టీతోని మెదక్ ఎంపీ సీటు కైవాసం చేసుకోబోతున్నామని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, శ్రీనివాస్, కిసాన్‌మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సీనియర్ నాయకులు సిద్దిరాములు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు ప్రసాద్, ప్రభాకర్,

నిశిరాత్రి కాసుల వేట..

- పల్లెల్లో గుట్టుగా ఇసుక దందా
- నదులు, వాగుల్లో నుంచి ట్రాక్టర్లతో తరలింపు
- ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే అడ్డుకట్ట వేయొచ్చు



నవతెలంగాణ-మెదక్

ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిశిరాత్రి సమీప నదులు, వాగుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను భేఖాతర్ చేస్తూ కొనసాగుతున్న ఇసుక దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వం ఇసుక రీచ్‌ల ఏర్పాటుతో పాటు సామాన్యులకు ఇంటి నిర్మాణాలకు ఉచితంగా ఇసుక తరలింపుకు చర్యలు చేపడితే అక్రమ దందాకు అడ్డుకట్ట వేయవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని మెదక్, హవేళిఘణాపూర్, కొల్చారం, వెల్దుర్తి, పాపన్నపేట మండలాల్లోని రాజ్ పేట, బూరుగుపల్లి, పాతూర్, అవుసులపల్లి తదితర గ్రామాల్లో మంజీర, హల్దీ వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో వాగుల్లోకి నీరు భారీగా చేరుతుందనే ఉద్దేశంతో ఇసుక తవ్వకాల్లో వేగం పెంచారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ట్రిప్ కు రూ.4500 నుంచి రూ.5500 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి 11 గంటల తర్వాత తెల్లవారుజామున 4 గంటల నుంచి ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలు జరిగే చోట ఇసుక కుప్పలు పోస్తున్నట్లు తెలుస్తోంది. గిరాకీ లేని సమయంలో గ్రామ శివారులో రహస్యంగా ఇసుకను డంప్ చేసి అవకాశం చూసి అమ్ముకుంటున్నారు.

అడ్డుకట్ట వేసినా ఆగని దందా

జిల్లాలో కొన్నేళ్లుగా పట్టపగ్గాలు లేకుండా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు నూతన ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే నిఘా ఏర్పాటు చేసి ఇసుక రవాణాకు పాల్పడిన వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ప్రభుత్వానికి డిడిలు చెల్లించి వాహనాలను బయటకు తీసుకొస్తున్న అక్రమార్కులు అధికారుల కళ్ళు కప్పి తమదైన శైలిలో ఇసుక రవాణా చేస్తున్నారు. అయితే సహజ సంపదను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్లనే అక్రమ దందాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక రీచ్ లు ఏర్పాటు చేయకపోవడం వల్లనే:

ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్లనే ప్రత్యామ్నాయంగా ఇసుక అక్రమ దందా కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో భవన నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండటంతో స్థానికంగా ఇసుక దొరకని పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం అక్రమార్కులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉన్న నదులు, వాగుల నుంచి ఇంటి నిర్మాణం కోసం ఉచితంగా ఇసుకను ఇవ్వనున్నట్లు ప్రకటించడం జరిగింది. కానీ ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోకపోవడంతో సామాన్యులు తమ ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం అవస్థలు పడుతున్నారు. వేలు ఖర్చు చేస్తూ ఇసుకను రహస్యంగా కొనుగోలు చేస్తూ అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టిసారించి ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడం లేదా సమీప నదులు, వాగుల నుంచి ఉచితంగా ఇసుక రవాణాకు అనుమతులు ఇస్తే ఇసుక అక్రమ దందాకు కళ్లెం వేయడంతో పాటు సామాన్యులకు భారం తగ్గి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అంతేకాకుండా అక్రమ వ్యాపారస్తుల వాహనాలకు పని దొరుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తాం

- ఐదు నెలల్లోనే రైతులు రోడ్డెక్కారంటే ప్రభుత్వం అసమర్థతనే వెంటనే వడ్లకు బోనస్ చెల్లించాలి
- రాష్ట్ర మాజీ అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని, ఐదు నెలల్లోనే రైతులు రోడ్డుకెక్కారంటేనే ప్రభుత్వం అసమర్థ పాలన కనబడుతుందని రాష్ట్ర మాజీ అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు వెంటనే వడ్లకు బోనస్ ప్రకటించి త్వరగా కొనుగోలు చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని దండుపల్లిలో వద్ద గల వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్ ఆధ్వర్యంలో ఇరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయం చేయలేని అసమర్థ ప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకు ఇస్తామని, దొడ్డు వడ్లకు ఇవ్వమని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయం చేసి ఉంటే రైతుల కష్టాలు తెలిసేవన్నారు. పది సంవత్సరాలు రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలో ఉన్నారని ఆ సమయంలో కరువు లేదు, విద్యుత్ అంతరాయం లేదు, రోడ్ల మీదకు వచ్చి ఎవరు ధర్నాలు చేయలేదన్నారు. నేడు విద్యుత్‌లో అంతరాయం ఏర్పడింది, సాగునీరు లేదు, బోర్లు ఎండిపోతున్నాయి, రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. ఒక వేళ వడ్లను ఇలాగే కొనకపోతే ఎన్నికల కోడ్ ముగియగానే పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి వంటావార్పు కార్యక్రమంతో ప్రభుత్వంపై నిరసన చేపడతామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో కేవలం ల్యాండ్ గ్రాబర్స్ టిప్పర్లు ఉన్నవాళ్లు, అక్రమ మట్టిదందా చేసే వారికి మద్దతుగా ఉండే పరిస్థితి నెలకొందని, అలాంటి బట్టేబాజ్ గాల్లు పార్టీలు మారొచ్చుగాని తామంతా రైతులు ప్రజల పక్షాన ఉండి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసి పొట్టోల్ల లతా వెంకట్‌గౌడ్, పంజా భిక్షపతి, చంద్రారెడ్డి, సిద్దిరాంరెడ్డి, రమేష్, తూప్రాన్ మండల పార్టీ ఉపాధ్యక్షులు సీత మహేష్, మహబూబ్‌రెడ్డి, రతన్‌లాల్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్, మహెందర్‌గౌడ్‌లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు రైతులు పాల్గొన్నారు.

కానరాని జెడ్పీ చైర్మన్, ముఖ్య నాయకులు

బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన రైతు నిరసన కార్యక్రమానికి ముఖ్య నాయకులు దూరంగా ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ స్వంత మండలంలోనే ధర్నా కార్యక్రమం ఉన్నప్పటికి కార్యక్రమానికి హాజరుకాలేదు. ముందుగానే కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ హాజరవుతున్నట్లు సమాచారం ఉన్నప్పటికి కార్యక్రమానికి రాకపోవడం గమనార్హం. తూప్రాన్ ఉమ్మడి మండలం నుంచి పెద్ద ఎత్తున రైతు నిరసన చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిరణయించినప్పటికి పార్టీకి చెందిన ఇరు మండలాల అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్‌రెడ్డి, పురం మహేశ్వర్ ముదిరాజ్‌లతో పాటు ఇతర గ్రామ కమిటీ అధ్యక్షులు కూడా నిరసన కార్యక్రమానికి హాజరు కాలేదు. కేవలం వంటేరు ప్రతాప్‌రెడ్డి వర్గంగా చెప్పుకుంటున్న వారు మాత్రమే హాజరయ్యారంటూ పార్టీ నాయకులు చెపుతున్నారు. నిరసన కార్యక్రమంలో కూడా వర్గ విబేధాలు కనిపించే విధంగా మారింది. ఇప్పటికైనా వర్గ విబేదాలు మాని పార్టీ కోసం, ప్రజల పక్షాన ఉండి ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలి

- ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- సీఎస్ శాంతి కుమారి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు





నవతెలంగాణ - మెదక్

పాఠశాలల పున ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన కనీస మౌలిక వస్తువుల కల్పన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. మెదక్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ మధూరి, సిద్దిపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మను చౌదరి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల పోలింగ్ ను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపద్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు మంచి పురోగతి సాధించారని, దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేసి కనీస మౌలిక వస్తువుల పనులు గ్రౌండ్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలలను పున:ప్రారంభించేందుకు మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేయలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాలికల విద్యార్థుల సంఖ్య ప్రకారం తప్పనిసరిగా ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, వీటిని అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల పెయింటింగ్ వేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన చోట పెయింటింగ్ పనులు సైతం చేపట్టాలని, మంజూరు చేసి ఇప్పటివరకు గ్రౌండ్ కాని పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూని ఫామ్ జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు17 జిల్లాలకు బట్ట చేరిందని, మరో 3 రోజులలో మిగిలిన జిల్లాలకు యూనిఫామ్ బట్ట చేరుతుందని తెలిపారు. జిల్లాలో కుట్టు మిషన్లలో అనుభవం కలిగిన గుర్తించిన స్వశక్తి మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాంలో కుట్టే ఆర్డర్ అందించాలని సూచించారు. పాఠశాలలు పున ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ తప్పనిసరిగా యూనిఫారంలు సన్నద్ధమయ్యేలా రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని తెలిపారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం లక్ష్యంగా మార్చి 15 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15 వేల దరఖాస్తులను పరిష్కరించామని, లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునః ప్రారంభించాలని, మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ధరణి దరఖాస్తుల పరిష్కారం పై జిల్లా కలెక్టర్లు రెగ్యులర్గా తహసిల్దారులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన మార్పులు ధరణి మాడ్యుల్స్ లలో చేయడం జరిగిందని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులలో అధికంగా రెవెన్యూ, ధరణి సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, వీటి ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 8న ప్రజావాణి కార్యక్రమాన్ని మన రాష్ట్రంలో ప్రారంభించామని, ఎన్నికల నేపథ్యంలో జూన్ 07 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేశామని, ప్రజావాణి కార్యక్రమం పునః ప్రారంభానికి ముందే పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఉన్నప్పటికీ రికార్డు సమయంలో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేయాల్సి ఉందని, వీటిని సత్వరమే కొనుగోలు చేయాలని అన్నారు. 5 రోజులపాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు ఎట్టి పరిస్థితులలో నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ప్రారంభించామని, చివరి దశలో పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు పురోగతి అంశాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేశామని, వీటిని త్వరితగతిన కొనుగోలు దారులకు అప్పగించాలని, గోడౌన్ల నుంచి త్వరితగతిన ధాన్యం తరలింపు పూర్తి కావాలని సూచించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ హరికృష్ణ, డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, పిడి మెప్మా ఇందిరా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పక్కందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు



నవతెలంగాణ - మెదక్

ఈ నెల 24 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పై ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యంత జాగ్రత్తతో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా విద్యార్థుల భవిష్యత్తు పై ప్రభావం చూపుతుందన్నారు. పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రంలోకి చేరుకోవాలన్నారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరిక్షలు మే 24 నుండి జూన్ 3 వరకు జరుగుతాయని, జిల్లాలో 6,110 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరంలో 3,812 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరంలో 2,298 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకోసం 22 కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రతి కేంద్రంలో సిసి.కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, 22 చీఫ్ సూపరింటెండెంట్లు, 22 శాఖాధికారులతో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, 4 సిట్టింగ్ స్క్వాడ్, 4 కస్టడీయన్ టీములు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారన్నారు. ప్రశ్న పత్రాల స్టోరేజికి 13 పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు పోలీస్ శాఖ ప్రశ్న ప్రత్రాల స్టోరేజి, తరలింపులో, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, వైద్య అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయ కలుగకుండా చూడాలన్నారు. విద్యుత్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోనీ స్పీడ్ పోస్ట్ ద్వారా పంపాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెస్ వంటివి తీసుకురాకుండా తనిఖీ చేసి సమీపంలోని కలెక్టింగ్ పాయింట్ లో డిపాజిట్ చేయాలనీ, తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఇంటర్మీడియట్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రాజేష్, ఆర్టిసి మేనేజర్ సుధా, విద్యుత్, పోస్టల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- జెడ్పీటీసీ రమేష్ గౌడ్

నవతెలంగాణ -వెల్దుర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జెడ్పిటిసి రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయక కాలయాపన చేస్తుందని విమర్శించారు. రైతు పండించిన దొడ్డు రకం వడ్లకు 500 బోనస్ ఇవ్వాల్సిందేనని ఆయన అన్నారు. ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో మోసం చేస్తుందని ఎన్నికలు కాగానే కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తానని చెప్పడం అన్నదాతలను మోసం చేసినట్లేనని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు ఎప్పుడు కూడా ఇబ్బందులు పడలేదని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు పడవద్దని ప్రతి గింజను కొనుగోలు చేయడం జరిగిందని రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన రెండు మూడు రోజుల్లో దాన్యం డబ్బులు రైతుల ఖాతాలో వేసిన ఘనత కేసిఆర్ కి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, మాజీ మెదక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్, నాయకులు అశోక్ గౌడ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సంపాదనలో పొదుపు చేయటం అలవర్చుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

జీవనోపాధి కోసం సంపాదనలో కొంత మేరకైనా పొదుపు చేయటం వలన ఆపదలో ఇతరులపై ఆదారపడకుండా ఉండగలుగుతామని రాజగోపాల్ పేట పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు కడారి తిరుపతి రెడ్డి అన్నారు. పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన గంగా దేవి మధు ఇటీవలే మరణించాడు. శుక్రవారం నంగునూరు పురుషుల పొదుపు సంఘంలో నామిని అయిన అతని భార్య రజితకు రూ.70 వేల నగదును అందజేశారు. మధుకు సమితి తరపున మంజూరైన సామూహిక బీమా క్లైం-1,2, అభయ నిధివపత్సాహాయం కలిపి డెబ్బై వేలు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఒక క్రమ పద్ధతిలో నియమిత పొదుపు చేసుకునే అవకాశాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పురుషుల సంఘంలో సభ్యుడిగా నమోదైన వారు సామూహిక బీమా నిధి పథకంలో చేరితే ఎలాంటి మరణం సంభవించినా నామినికి రూ.40 వేల నగదును సహావికాస సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజపేట గోపాల్, ఉపాధ్యక్షుడు ఆరె శ్రీనివాస్, గణకుడు అనంతారం రాము తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



నవతెలంగాణ-తొగుట

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో ఇటీవల బెస్త ప్రభుదాస్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి రూ.4 వేల ఆర్థిక సహాయం అందజేశారు. చిన్న తనంలోనే ప్రభుదాస్ తనువు చాలించడం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పులిగారి శివయ్య, నాయకులు సుతారి రాములు, బండారు స్వామి గౌడ్, కంకనాల స్వామి, ఎంగలి రాములు, బెజ్జన మైన కనకరాజు, బెస్త భిక్షపతి, రాజు, స్వామి, లక్ష్మ న్, సురేష్, నాగులపల్లి నరేష్, కనకయ్య నవీన్, నరేందర్, సత్తయ్య, శేఖర్, గణేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న కోట మైసమ్మ రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రంగారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్క్ నుండి కోట మైసమ్మ అంబేద్కర్ కాలనీ వెళ్లే రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సందిటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ రోడ్డు వెడల్పు నిర్మాణం పూర్తి చేయాలని గత ప్రభుత్వం ప్రారంభించిన సంవత్సరాలు గడిచిన పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పాత ఎంపీడీవో కార్యాలయం నుంచి కోట మైసమ్మ వరకు రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు. కొత్త ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి పెట్టాలన్నారు. ఇండ్లను తొలగించినప్పటికీ రోడ్డులో ఇల్లు కోల్పోతున్న వారికి ఇల్లు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్‌లలో అవకాశం కల్పించి, రోడ్డు పూర్తి చేయాలని ఆయన కోరారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మాణం చేయకపోవడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారిందన్నారు. గజ్వేల్ పట్టణంతో పాటు జాలిగామా, బయ్యారం రాయపోల్ దౌల్తాబాద్ వెళ్లే గ్రామాల, పట్టణవాసులు కూడా పాండవుల చెరువు వెళ్లాలన్నా ఈ రోడ్డు గుండా వెళ్లడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వెంటనే జోక్యం చేసుకొని కోట మైసమ్మ రోడ్డును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమ్మర్ డ్యాన్స్ తరగతులను ప్రారంభించిన చైర్ పర్సన్

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలోని కమ్యూనిటీ భవనంలో రాఘవ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మర్ డ్యాన్స్ తరగతులను మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్ బైరి గిరి, కౌన్సిలర్ వరాల కవిత-సురేష్, జంగిటి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొద్దుతిరుగు కొనుగోళ్లు ముగింపు

- పీఏసీఎస్ సీఈఓ వాసు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ యందు పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోళ్లు శనివారంతో ముగియనున్నట్లు సీఈఓ వాసు శుక్రవారం తెలిపారు. పొద్దుతిరుగుడు సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని వాసు సూచించారు.

రైతుల అభివృద్ధియే కాంగ్రెస్ ధ్యేయం



నవతెలంగాణ-కొండపాక

రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసవి లింగారావు జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ అన్నారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత 10 సంవత్సరాల బీ.ఆర్.ఎస్ కాలంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని వారి పాలన విధానం రైతులను నష్టపరిచిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులను మోసం చేసింది. పోయి ఇతరుల మీద విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుల పక్షపాతి ప్రభుత్వం ఎవరో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ అవుతుందని అలాగే రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. రైతుల ఇబ్బందులు తీర్చనందున బిఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అయినప్పటికీ వారు ఇంకా బుద్ధి తెచ్చుకోవడం లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, నరేందర్ రావు, సిద్ధులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శిక్షణతో విద్యా వికాసం




నవ తెలంగాణ-సిద్దిపేట

శిక్షణతో విద్యా వికాసమని షిరిడి సాయిబాబా దేవాలయ ట్రస్టు అధ్యక్షులు గందె శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పిల్లలకు ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఈ తరానికి దగ్గర చేయడం అనివార్యమన్నారు. యోగ, ప్రాణాయామం, ధ్యానం, శ్లోకాలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిగా మారుతాయని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ వేసవి సెలవులు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు శక్తివంతులుగా మారినప్పుడే చదువుల్లో కూడా మెరిసిపోతారన్నారు. ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సెల్ ఫోన్లు, టీవీలతో నేర్చుకున్న విద్య తరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ శిబిరం నేటి నుంచి జూన్ 10వ వరకు కొనసాగనుందని, ప్రతిరోజు ఉదయం 7:30 నుంచి 8:30 వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తి కలవారు 6302227030 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ టెక్నికల్ కార్యదర్శి, యోగశిక్షకులు తోట సతీష్, తోట సంధ్య మనీషా తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

నవ తెలంగాణ కొండపాక



మండల కేంద్రమైన కొండపాక గ్రామాని కి చెందిన నీల యాదగిరి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యం తో మృతి చెందాడు. విషయం తెలుసు కున్న గ్రామాని కి చెందిన హనుమాన్ టెంట్ హౌస్ యూని యన్ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో బర్రె బాల్ నరసయ్య, రేణు కుమార్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పండ్ల మండి-వలస కూలీలకు ఉపాధి

- మూడేళ్ల కింద మండి ఏర్పాటుతో జోరుగా సాగుతున్న మామిడి వ్యాపారం

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామ పరిసర ప్రాంతాల్లో సిద్దిపేట -హుస్నాబాద్ రహదారిపై మామిడి పండ్ల మండి వలస కూలీలు ఉపాధి పొందుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం సిద్దిపేటకు చెందిన పండ్ల వ్యాపారి ఎం.డీ. బాబా ఫరూద్దీన్ ముండ్రాయిలో ఏర్పాటు చేసిన మామిడి వ్యాపారం జోరుగా సాగుతోంది. పండ్ల వ్యాపారంలో 25 సంవత్సరాల అనుభవమున్న ఫరూద్దీన్ జిల్లాలో ఏటా మామిడి పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో వినూత్నంగా ఆలోచించి రహదారి పక్కనే రెండు ఎకరాల వ్యవసాయ భూమిని గత కొన్ని సంవత్సరాల పాటు లీజుకు తీసుకొని మండిని ఏర్పాటు చేశారు. గతంలో సిద్దిపేట మామిడి రైతులు వారి దిగుబడులను విక్రయించుకోవాలంటే దళారులు, కమిషన్, వ్యయ ప్రయాసాలు ఓర్చుకొని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లాంటి పట్టణాల్లో మాత్రమే విక్రయించేవారు. ఈ ప్రాంతంలో మామిడి మండి ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల 50 కిలోమీటర్ల పరిధిలో సాగుచేసిన మామిడి రైతులకు మంచి ఆదాయం రావడంతో పాటు బీహార్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర చెందిన సుమారు 410 మంది వలస కూలీలకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఎం.డీ. బాబా ఫరూద్దీన్ తన కూలీలతో కలిసి తోటలను నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నాడు. వలస కూలీల ద్వారా కాయలను కోసి తన సొంత వాహనాలలో మండికి తరలిస్తున్నారు. కూలీల సహాయంతో గ్రేడులుగా విభజించి బాక్సుల్లో పేపర్‌తో క్రమబద్ధంగా పేర్చి దేశంలోని ఇతర ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, ఉత్తరాఖండ్, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తూ మంచి ఆదాయాన్ని అర్జిస్తూ వలస కూలీలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. రెండున్నర నెలలుగా 410 మంది వలస కూలీలకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన మామిడి మండితో ప్రతి ఏటా వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. దీంతో ఇతర రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రలోని వలస కూలీలకు రెండున్నర నెలల పాటు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. మొత్తం 410 మంది వలస కూలీలగాను 350 మంది కూలీలు కాయలను కోయగా 60 మంది కోసిన కాయలను గ్రేడ్లుగా విభజించే ప్రక్రియను చేపడతారు.

మండి ఏర్పాటుతో రైతులకు తగ్గిన ఖర్చులు

గతంలో ఇక్కడి రైతులు మామిడి దిగుబడులను విక్రయించుకోవాలంటే కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నగరాలలో దళారులు వేలం వేసిన ధరలకే కాయలను విక్రయించుకునేవారు. అంతేకాకుండా 10 శాతం కమిషన్ ఇవ్వడంతోపాటు కాయలు కోసి రవాణా ఖర్చుల భారం రైతులపై పడేది. ఇక్కడ మండి ఏర్పాటుతో రైతుల వద్దకే ఫరూద్దీన్ వెళ్లి రైతులకు నచ్చిన ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తూ రైతులకు



మద్దతు ధర కల్పిస్తున్నాడు. ప్రతిరోజు ఇక్కడ సుమారు 50-60 టన్నుల మామిడి కాయల వ్యాపారం కొనసాగుతుంది. ముఖ్యంగా దసేరి, బంగనపల్లి, హిమాయత్, మల్లిక రకాలను కొనుగోలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి

జిల్లాలోని సిద్దిపేట, చేర్యాల, హుస్నాబాద్ వంటి ప్రాంతాలే కాకుండా జోగిపేట్, రామాయంపేట, కామారెడ్డి, బేగంపేట్ తదితర ప్రాంతాల్లో నుంచి రైతులు దిగుబడులు ఇక్కడికి తెచ్చి మద్దతు ధరకు విక్రయించుకుంటున్నారు.

రైతులకు సిరులు కురిపిస్తున్న వాణిజ్య పంటలు

నవతెలంగాణ-గజ్వేల్

రైతులకు వాణిజ్య పంటలు సిరులు కురిపిస్తున్నాయని చెప్పాలి. పత్తి, మొక్కజొన్న, వరి పంటల సాగులతో లాభ, నష్టాలు ఎలాగున్నా వాణిజ్య పంటలపై రైతులు మక్కువ చూపుతున్నారు. జిల్లాలో సుమారు 30 వేల మంది రైతులు 15 వేల ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు, పాలకూర, పచ్చ కూర, తోటకూర, కరివేపాకు, కొత్తిమీర, బీరా కాకర, వంకాయ, సోలా మిరప బీన్స్, దొండా, బెండకాయలు క్యారెట్ తదితర కూరగాయల పంటలపై దృష్టి పెట్టి రైతులు సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా పలువురు రైతులు ఆరుతడి పంటలపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో నీటి ఎద్దడి కారణంగా ఆరుతడి పంటలను ఎంచుకున్నారు. ఇప్పుడు నీటి లభ్యత పుష్కలంగా ఉంది. అయినా వాణిజ్య పంటలు సాగు చేసుకుని లాభాలు పొందాలన్న ఉద్దేశంతో జిల్లాలో చాలా మంది అన్నదాతలు తక్కువ నీటితో పండే పంటలను ఎంపిక చేసుకుంటున్నారు. ముఖ్యంగా కూరగాయలు, తీపి మొక్కజొన్న, ఉల్లిగడ్డ, పూల తోటల పెంపకంపై శ్రద్ధ చూపుతున్నారు. మొక్కల (నారు) విక్రయ కేంద్రాలు అందుబాటులోకి రావటంతో రైతులకు శ్రమ తగ్గిపోయింది. పందిరి విధానంలో గజ్వేల్‌లో బీరకాయలను సాగు చేస్తున్న రైతులు వాటిని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు ఎగుమతి చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ పరిసరాలకు నిత్యం తాజా కూరగాయలు పంపించటంలో జిల్లా ముందంజలో ఉంటోంది. ములుగు, వర్గల్, తూప్రాన్, మనోహరాబాద్, కొండపాక, సిద్దిపేట, దుబ్బాక తదితర మండలాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు. గజ్వేల్ మండలం బంగ్లవెంకటాపూర్, కోమటి బండ, ఆహ్మదీపూర్, శేరుపల్లి, దిలాల్పూర్, ధర్మారెడ్డిపల్లి గిరిపల్లి, వర్గల్ మండలం పాతూరు, పాములపర్తి, గౌరారం, చౌదర్పల్లి, మర్కుక్ మండలం ఎర్రవల్లి, గణేశ్పల్లి, చిన్నకోడూరు. తొగుట తదితర గ్రామాల్లో తక్కువ నీటితో కూరగాయలు పండిస్తున్న రైతులకు లాభాలు చేతికందడంతో చాలా మంది ఇదే బాట పట్టారు. ప్రభుత్వం కొందరికి పందిళ్లు, డ్రిప్ పరికరాలు అందజేసి ప్రోత్సహిస్తుండగా, మరికొందరు రైతులు అందుబాటులో ఉన్న వనరులతో నీటి కుంటల సహాయంతో కూరగాయాలు పండిస్తున్నారు. మిరుదొడ్డి, తొగుట, చిన్నకోడూరు, గౌరవరం, తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ఆకు పచ్చని పంటలతో చేనులు కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం మరింతగా ప్రోత్సహిస్తే ఉత్సాహంగా ముందుకు సాగుతామని రైతులు తెలిపారు. కూరగాయలు పండించే రైతులు వాటిని విక్రయించుకొని లాభం పొందేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్కెట్లకు తరలిస్తున్నారు. గజ్వేల్‌లో సమీకృత మార్కెట్లో, ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్



రహదారి పక్కన ఏర్పాటు చేసిన రైతు మార్కెట్లో నిత్యం వందలాది మంది రైతులు కూరగాయలు అమ్ముకుని లాభాలు పొందుతున్నారు. వంటిమామిడిలో ఉన్న మార్కెట్ యార్డు వద్ద కూడా రైతులకు సౌకర్యాలు కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన పలు ప్రైవేటు సంస్థలు వాటి దుకాణాల్లో అమ్మేందుకు రైతుల వద్ద క్వింటాళ్ల కొద్ది కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. వాటిని సంస్థలకు తరలించుకుంటున్నారు. దీనివల్ల రైతులకు మార్కెట్ సదుపాయం కలుగుతోంది. ఆరుతడితో లాభాలు పొందుతున్నారు. రైతులు ఆరుతడి పంటలు వేసుకుని లాభాలు పొందాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. సుమారు 15 వేల ఎకరాల్లో వివిధ రకాల కూరగాయాలు పండిస్తున్నారు. నిత్యం హైదరాబాద్‌కు 8 టన్నులకు పైగా కూరగాయలు రవాణా చేస్తున్నారు.

అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- ముంపు గ్రామాల వారికి ప్యాకేజీలు పూర్తి చేయాలి సమగ్రంగా సర్వే నిర్వహించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వం ఎంపిక చేసిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను సమగ్రంగా సర్వే నిర్వహించి ఇండ్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల వారికి కూడా ప్యాకేజీ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలను గజ్వేల్ పట్టణవాసులను మోసం చేసిందన్నారు. ముంపు గ్రామాల వారికి పూర్తిగా నష్టపరిహారం ప్యాకేజీలు ఇవ్వకుండా ఆగమేఘాల మీద గజ్వేల్‌కు తీసుకువచ్చి భయభ్రాంతులకు గురి చేసిందని కుటుంబాలను రోడ్డున పడేసిందన్నారు. ముంపు గ్రామాల లబ్ధిదారుల ఎంపికలో అనేక మోసాలు జరిగాయని అదే క్రమంలో గజ్వేల్ పట్టణంలోని డబల్ బెడ్ రూమ్ ఎంపికలో కూడా అవకతవకలు జరిగాయని విమర్శించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి ముంపు గ్రామాల ప్రజలకు అర్హులందరికీ ప్యాకేజీలు ఇండ్లు ఇవ్వాలని గజ్వేల్ పట్టణవాసులకు కూడా అనర్హుల పేర్లు తొలగించి అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. అటు మల్లన్న సాగర్ నిర్వాసితులు, ఇటు పేద ప్రజల కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. గతంలోనే గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని, ఆ తర్వాత సర్వే చేసినా



ఇప్పటివరకు అధికారులు పేదలకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించకపోవడంతో పాటు మల్లన్న సాగర్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ ప్లాట్లు ఇవ్వలేదన్నారు. ఈ రెండు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 2016 లో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ 2018లో పూర్తి చేశారని అప్పటికే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని సర్వే పూర్తి చేసినప్పటికీ గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వమే పంపిణీ చేస్తే ఈ సమస్య వచ్చేది కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది

నవతెలంగాణ-దుబ్బాక

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను ఎన్నడూ పట్టించుకోని బీఆర్ఎస్ నేడు కపట ప్రేమను చూపుతూ వారి పట్ల మొసలి కన్నీరు కారుస్తుందని డీసీసీ జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్ అన్నారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అందె రాజిరెడ్డి, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంజీవరెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. వరేస్తే ఉరేనని అన్నదాతలను బెదిరింపులకు గురిచేసింది, రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ దేనని కమలాకర్ విమర్శించారు. నేడు బోనస్ ఇవ్వాలంటూ ధర్నాలు చేయడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం, కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని రూ.6 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచాడని ఆరోపించారు. గతేడాది అకాల, వడగండ్ల వానలతో దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ఎకరాల్లో పంట నష్టం జరిగితే, అప్పటి మంత్రి హరీశ్ రావు స్వయంగా పరిశీలించి ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. తన సిద్దిపేటకు మాత్రమే చెల్లించి దుబ్బాక నియోజకవర్గానికి నష్ట పరిహారం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన 6 హామీల్లో 5 అమలు చేయడం జరిగిందని, మిగతా హామీలను ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం అమలు చేస్తుందన్నారు. వర్షాకాలం వేసిన



పంటలకు క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. ఆగస్టు 15 వరకల్లా తమ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పై అవాకులు చవాకులు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఏ.అంబదాస్, ఏ.రవి, కే.బాలరాజు, కే.రాజేందర్, బీ.ధర్మపురి ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్రకో కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట ఇచ్చిన విధంగా ఆగస్టు 15 లోపు రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలం పంటకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు చేపట్టారన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నాయకులు కొడారి మల్లారెడ్డి, చెంది సత్యనారాయణ, ఖాతా రాజిరెడ్డి, మార్క



చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లకు బోనస్ వర్తింప జేయాలి

- తడిసిన ధాన్యాన్ని కొనాలి
- సీపీఐ(ఎం) సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపచేయాలనీ, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామనడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురౌతున్నదని పేర్కొన్నారు. గురువారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు తల్లడిల్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఐదు రోజులు భారీ వర్షాలుంటాయంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నదని తెలిపారు. అందువల్ల రైతులు మరింత నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో 20 శాతం మాత్రమే సన్నబియ్యం పండించే రైతులు, 80 శాతం దొడ్డు బియ్యం పండించే రైతులున్నారని వివరించారు. వాళ్ల అత్యధికులు సన్న, చిన్నకారు రైతులేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామంటూ వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. సన్న బియ్యం లేదా దొడ్డు బియ్యం గురించి ప్రస్తావించలేదని తెలిపారు. ఇపుడు సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే బోనస్ వర్తిస్తుందనే వార్తలు రైతులను తీవ్ర ఆందోళనకు



గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. అన్ని రకాల వడ్లు పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ యాసంగి పంటకు బోనస్ చెల్లింపును వర్తింపచేయాలని సూచించారు. రైతుల్లో ఉన్న ఆందోళనను తొలగించడం కోసం ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతుల్లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న వర్షాలకు మరింత తడిసి పోకుండా తగు ఏర్పాట్లు చేసి, తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేసారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం వల్ల చేతికి వచ్చిన పంట తమ కండ్ల ముందే తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు విన్నవించారు. ప్రభుత్వం వెంటనే బోనస్‌ను చెల్లించి ఎన్నికలలో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లలతో మాట్లాడి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్ని రకాల వడకు బోనస్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బాల నరసింహులు భూమవ్వ , లక్ష్మిరాజు, శంకర్, బుచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ పెయింటింగ్‌లో ధర్మాజీపేట విద్యార్థినికి ప్రథమ స్థానం



నవతెలంగాణ-దుబ్బాక

ఆర్‌బీఐ నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పలు విభాగాల్లో దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట వార్డు జడ్పీ హెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని జీ.భావన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి చేతుల మీదుగా భావన రూ.2000 నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని భావనను ఎంఈఓ ప్రభుదాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వాతావరణ మార్పులతో సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-నంగునూరు

ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు వాతావరణ మార్పులతో వడ్ల కొనుగోలు కేంద్రాల్లోని రైతులు, హమాలీలు సమయపాలన పాటించుకుంటూ తూకం వేయాలని సోసైటి చైర్మన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి అన్నారు. నంగునూరు మండలం మగ్దుంపూర్, నాగరాజుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకుంటూ రైతులు, హమాలీలు ఉదయం, సాయంత్రం వేళలో పనులు చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రైతులు తమ ధాన్యం కాంటాలు అయిన వెంటనే ఆధార్, బ్యాంక్ అకౌంట్, భూమి పట్ట పాసు బుక్ జిరాక్స్‌లు వెంటనే సెంటర్ నిర్వాహకులకు అందజేయాలని తెలిపారు. ఒక లారీలో 6 నుండి 8 మంది రైతుల ధాన్యం పడుతుందని, లారీలో పోయిన ధాన్యానికి సంబంధించి రైతులు అందరూ జిరాక్స్‌లు ఇవ్వాలని, ఏ ఒక్క రైతు జిరాక్స్‌లు ఇవ్వకున్నా ఆ లారీకి సంబంధించిన రైతులకు డబ్బులు జమ కావడంలో జాప్యం జరుగుతుందన్నారు. సెంటర్ నిర్వాహకులు ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు.

వడ్లతో కన్యకా పరమేశ్వరి చిత్రం



నవతెలంగాణ-గజ్వేల్

కన్యకా పరమేశ్వరి మాత జయంతిని పురస్కరించుకొని అద్దాల మందిరం వద్ద అమ్మ వారి చిత్రాన్ని వడ్లను ఉపయోగించి 2 రోజులు శ్రమించి అత్యద్భుతంగా కన్యకా పరమేశ్వరి చిత్రాన్ని అపురూపంగా రూపొందించి ప్రత్యేక పూజలు జరిపి రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అమ్మవారి చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడిని సేవించుకోడానికి అనేక మార్గాలు ఉన్నాయన్నారు. నాలో ఉన్న ఆధ్యాత్మిక కళకు పదను పెట్టి ఆ పరమాత్ముని చిత్రాలు ఎన్నో చిత్రించానన్నాడు. శాశ్వతమైన భగవన్నామాన్ని ప్రతి ఒక్కరు స్మరించాలన్నారు. కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. వైశ్యుల కుల దైవం కన్యకా పరమేశ్వరి మాత అన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను అప్పగించిన ఎస్ఐ



నవతెలంగాణ-చేర్యాల

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకుని తిరిగి బాధితునికి శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ దామోదర్ అప్పగించారు. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండల పరిధిలోని గుర్జకుంట గ్రామానికి చెందిన వలబోజు నర్సింహాచారీ తన మొబైల్ ఫోనును 2023 అక్టోబర్ 10న పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్సైట్లో ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న నర్సింహా చారికి ఎస్ఐ అందజేశారు.

అధిక రక్త పోటుతో జాగ్రత్తగా ఉండాలి

- సురభి కళాశాలలో అధిక రక్తపోటు దినోత్సవం

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా సురభి వైద్య కళాశాల, సురభి మల్టీస్పెషల్టి హాస్పిటల్ ఆవరణలో శుక్రవారం అధిక రక్తపోటు మాసం ప్రణాళిక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డాక్టర్. రాంప్రసాద్ అధిక రక్త పోటు మాసం గురించి పలు సూచనలు చేశారు. ఈ మాస ఉత్సవంలో అధిక రక్తపోటు రోగులకు ఉచిత వైద్య సలహాలు, సంబంధించిన రక్త పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీ మండల హెడ్ క్వార్టర్స్‌లో ఉచిత వైద్య శిబిరం కూడా నిర్వహించి అధిక రక్తపోటు సంబంధించిన రోగులకు సూచనలు జాగ్రత్తలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మాస ఉత్సవంలో సిద్దిపేట పాత బస్టాండ్ నుండి మండల బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ కేపీ. గోపీచంద్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ ప్రసాద్, మెడిసిను ప్రొఫెసర్ డాక్టర్ కర్నాకర్, ఆర్ఎంఓ డాక్టర్ జలపతి నాయక్ డాక్టర్ సామ్యూల్ పి. ఆర్వో పరశురాములు, నర్సింగ్ సూపరిండెంట్ కమలేష్ పాల్గొన్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-చిన్నకోడూరు

తండ్రిని కొట్టాననే మనస్థాపంతో యువకుడు విషం సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మే11 మధ్యాహ్నం తల్లిని కొడుతున్నాడని సోదరి ఫోన్ చేసి చెప్పగా కోపోద్రిక్తుడైన వల్లేపు శేఖర్(24) హుటాహుటిన ఇంటికి వెళ్ళి తండ్రిని గల్ల పట్టుకొని కొట్టాడు. కానీ కొంత సమయంలోనే తన తండ్రి తప్పు లేదని తెలియగా అనవసరంగా తండ్రిని కొట్టాననే మనస్థాపంతో చంద్లాపూర్ శివారులోని ఓపెన్ జిమ్ వద్ద అదేరోజు రాత్రి సమయంలో శేఖర్ విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం విశ్వ బ్రాహ్మణ(విశ్వ కర్మ)సంఘం ఆధ్వర్యంలో జగద్గురువు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవమూర్తులకు పంచామృత అభిషేకం, యజ్ఞంతో పాటుగా పలు కార్యక్రమాలు జరిగాయి.

పెద్ద దిక్కు కోల్పోయి.. కష్టతరంగా జీవనం

- ఇద్దరు పిల్లలతో అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్న ఇల్లాలు
- సర్కార్ సాయం కోసం ఎదురుచూపు



నవతెలంగాణ-గజ్వేల్

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి సాయం కోసం బిక్కు బిక్కుమంటూ ఓ రైతు కుటుంబం దిక్కులు చూస్తుంది. సాగు కోసం చేసిన అప్పులకు తోడు తరుచూ కాలిపోతున్న బోరు మోటారును రిపేర్ చేయించే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తూ గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు చిగురు స్వామి (36) ఫిబ్రవరిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పెద్దదిక్కు మృతితో ఆ కుటుంబ జీవన పరిస్థితిని చూసిన వారంత అయ్యో పాపం అంటున్నారు. ఇప్పుడు ఆ కుటుంబం సాయం కోసం ఎదురుచూస్తున్నది. ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నది. బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన చిగురు స్వామి తనకున్న ఎకరం వ్యవసాయ పొలంలో 30 గుంటల్లో వరి సాగు చేశాడు. సాగుకోసం చేసిన అప్పులు అధికమవడంతో పాటు సాగు చేసిన పంట ఎండిపోవడంతో ఆశించిన దిగుబడి రాదనే బెంగతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోరు మోటారు కాలిపోయిన సమయంలో రిపేర్ చేయడానికి సుమారుగా రూ.10 వేలు ఖర్చు అవుతుంది. రోజురోజుకూ సమస్యలు అధికమవడంతో కలత చెందిన స్వామి భార్య స్రవంతికి పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి వ్యవసాయ పొలం సమీపంలోనే చెరువు కట్టపై చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరేండ్లలోపు వంశీ, శనివేశ్ ఇద్దరు కొడుకులున్న విషయాన్ని మర్చి ఆత్మహత్యకు పాల్పడడంతో అప్పుల భారం భార్య స్రవంతికి తలకుమించిన భారంగా మారి బతకడమే కష్టమవుతున్నది.

ఉపాధి చూపి..సాయం చేయండి

చిగురుస్వామి భార్య స్రవంతి సొంతూరు వర్గల్ మండలం అనంతగిరిపల్లి, ఉన్నత పాఠశాల దశలోనే సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభను చూపించింది. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సిద్దిపేట జిల్లా జట్టు తరఫున ఆడగా మూడో స్థానంలో నిలవడంతో ఆమెను పీఈ టీలు అభినందించారు. చిన్న వయస్సులోనే పెండ్లి చేయడంతో మధ్యలోనే చదువు మానేసి భర్తకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. నా అనే వాళ్లు లేరు. ఇద్దరు పిల్లలతో ఎలా బతికేది. రూ.ఐదారు లక్షల అప్పులు ఎలా తీర్చాలంటూ కంట తడిపెట్టింది. బోరు కాలిపోయినప్పుడు డబ్బులు లేక బాగు చేయించకపోతే పొలం ఎండిపోయింది. ఇద్దరు పిల్లలతో జీవనం సాగించడం కష్టంగా మారిందని, క్రీడా రంగంలో ప్రతిభ ఉన్న తనకు ఆదే రంగంలో ఉపాధి చూపించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.

సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ బ్రతుకుతెరువుపై స్పందించి సాయం అందించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు భార్య స్రవంతి కన్నీరు పెడుతూ వేడుకుంటుంది. క్రీడారంగంలో ప్రతిభ ఉందని అదే రంగంలో ఏదైనా ఉపాధి చూపాలని తమ పిల్లల భవిష్యత్ దారి చూపాలని ఆమె పత్రిక ముఖంగా విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఈ విషయంలో సీఎం దృష్టికి తీసుకుపోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చేసిన అప్పులు తీర్చేది ఎలా అని బెంగతో కాలం వెళ్లదీస్తున్న అన్నారు.



బాధితురాలు స్రవంతి

వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి అధ్యక్ష తన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. పలువురు ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతేడాది వడగండ్ల వానతో జరిగిన పంట నష్టానికి నేటికీ నష్టపరిహారం చెల్లించడంలో అధికారులు తీవ్ర జాప్యం వహిస్తున్నారని చీకోడ్, పెద్దగుండవెల్లి, చిట్టాపూర్ ఎంపీటీసీలు లచ్చుమ్మగారి రాంరెడ్డి, పరికి రవిగౌడ్, కనకయ్యలు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్‌ను ప్రశ్నించారు. రైతుల విషయంలో నిర్లక్ష్యం ఎందుకని, వారి సమస్యలను పరిష్కరిస్తారా. లేదా. అని మండిపడ్డారు. అలాగే పంట నష్టం సంబంధించిన మండల నివేదికను ఇవ్వాలని పట్టుబట్టారు. పెద్దచీకోడ్‌లో సర్వేనెంబర్ 1134లో ఒకరికి పట్టాగా మరొకరికి అసైన్డ్‌గా ఎలా చేశారని, గతేడాది పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్దిదారులకు పట్టా సర్టిఫికెట్లు ఎప్పుడు ఇస్తారని డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌ని నిలదీశారు. అక్బర్‌పేట భూంపల్లి మండల తహశీల్దార్ జయంత్ ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చిట్టాపూర్ ఎంపీటీసీ కనకయ్య మండిపడ్డారు. వైస్ ఎంపీపీ అస్క రవి మాట్లాడుతూ, ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా రెవిన్యూ అధికారులు కృషి చేయాలని, అందులో జరిపిన మార్పుల్ని ప్రజలకు తెలియజేసే విధంగా ప్రతి గ్రామ పంచాయతీ వద్ద ఫ్లెక్సీ బ్యానర్‌లను ఏర్పాటు చేయాలని డీటీ సందీప్‌కు సూచించారు. అలాగే దొడ్డు రకం వరి ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని సభాముఖంగా ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా తమ గ్రామంలో ఇంకుడు గుంతలకు సంబంధించిన డబ్బులు రావట్లేదని పెద్ద గుండవెల్లి ఎంపీటీసీ పరికి రవిగౌడ్ ప్రశ్నించారు. తమ గ్రామాల్లోకి వస్తే అధికారులు తమకు సమాచారం ఇవ్వట్లేదని పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్ ఎంపీటీసీలు రవిగౌడ్, రామారం మాధవి రెడ్డిలు మండిపడ్డారు. అనంతరం ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులకు అధికారులు కచ్చితంగా సమాచారం ఇవ్వాలని, ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సత్వరం పరిష్కారం చూపేలా అధికారులు చొరవ చూపాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో ఉమాదేవి, సూపరిండెంట్ శ్యామలాదేవి, జడ్పీటీసీ కడ్తాల రవీందర్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, ఆర్ అండ్ బీ డీఈ వెంకటేశం, ఏవో ప్రవీణ్, పీఆర్ ఏఈ రిజ్వాన్, డిప్యూటీ తహశీల్దార్ సందీప్, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగతనాలు

- ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

తాళం వేసిన రెండు ఇళ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బచ్చాయిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బచ్చాయిపల్లి గ్రామానికి చెందిన మంత్రి ప్రశాంత్, అతని అన్న మంత్రి రాజు పక్క పక్కన ఇళ్లలో నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం అన్నదమ్ములు కుటుంబ సభ్యులతో కలిసి దుబ్బాక మండలం పెద్ద చీకోడు ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం వచ్చి చూసే సరికి రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా, ప్రశాంత్ ఇంట్లో 2 తులాల బంగారం 8 తులాల వెండి ఎత్తుకెళ్లారని మంత్రి రాజు ఇంట్లో 52 వేల నగదు, తులం బంగారం, 35 తులాల వెండి దొంగతనం జరిగిందని గుర్తించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దర్శనం భాగ్యలక్ష్మి మాస్టిన్ డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని.. ఇచ్చిన హామీ మేరకు వేంటనే ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఉపకులాల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దర్శనం భాగ్యలక్ష్మి మాస్టిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో ఎస్సీ ఉపకులాల మహిళలతో భాగ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ చైర్మన్‌గా బైరి వెంకటేశంను నియమించాలని దర్శనం భాగ్యలక్ష్మి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

డెంగ్యూ వ్యాప్తిపై అవగాహన



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం రేగొండ గ్రామంలో హెచ్ఈ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం డెంగ్యూ వ్యాప్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల వ్యాప్తి వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు, వ్యాధులు వస్తాయని అన్నారు. కాబట్టి ఇంటి ఆవరణలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, ఏఎన్ఎం చంద్రకళ,వనజ, కార్యదర్శి,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్న బీఆర్ఎస్

- అధికారం పోయాక అన్నదాతలు గురుకొస్తున్నారు.
- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్



నవతెలంగాణ-మర్కుక్

బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల కోసం దీక్షలు చేస్తూ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని, రైతులపై వారిది కపట ప్రేమేనని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్లల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ, వరి వేస్తే ఉరి అన్న కేసిఆర్ ఇప్పుడు రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామని చెప్పడం సిగ్గు చేటన్నారు. గతంలో అకాల వర్షాల వల్ల నష్టాల నష్టపోయిన రైతులకు పది వేల పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేశారని, రైతులు ఇబ్బందులు పడితే ఏ నాడు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అధికారం పోయాక రైతుల కోసం ధర్నాలు చేయడంలో అంతర్యమేమిటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు మేలు కోరీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రైతుబంధు రైతుల ఖాతాలో జమ చేశామని, పెన్షన్లు కూడాప్రతి నెల ఇస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇస్తున్నామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమవుతున్న బీఆర్ఎస్ పార్టీ తమ ఉనికి కోసం పాకులాడుతుందన్నారు. కేటీఆర్ వడ్లు కొను గోలు చేయడం లేదనడం వారి విచక్షణకే వదిలేస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో ఆనాడు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువు దోపిడీ చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. రైతులకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, గత ఎన్నికల్లో చెప్పినట్టుగానే వచ్చే వర్షాకాలం పంటకి రైతులకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఆగస్టు 15 వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష జరిపి రుణమాఫీపై సాధ్యాసాధ్యాలను ఇతర రాష్ట్రాలకు వెళ్లి పరిశీలించాలని సూచించారని తెలిపారు. త్వరలోనే రైతుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. బీఆర్ఎస్ దీక్షలను చూస్తుంటే రైతులపై కల్లబొల్లి ప్రేమ వలకబోస్తున్నారని అర్ధమవుతుందన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం దుబ్బాకలో మీడియాతో వారు మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు ఆరుగాలం పండించిన ధాన్యం నీటి పాలవుతుందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ద్వారా అందించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రైతన్నలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సన్న వడ్లకే రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పడం సరికాదన్నారు. దొడ్డు రకం వడ్లకు సైతం రూ.500 బోనస్ ను అందించాలని డిమాండ్ చేశారు .

రైతులు వరి గడ్డిని కాల్చి భూసారాన్ని తగ్గించవద్దు

- ఏఈవో శివకుమార్



నవతెలంగాణ-కోహెడ

రైతులు వరి పంట చేతికందాక నేలపై ఉన్న వరి గడ్డిని కాల్చవద్దని తద్వారా భూసారం తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వరికోలు గ్రామంలో రైతులకు వరిపంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరిపంట అవశేషాలను కాల్చడం వలన నేలలో సహజంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్రపురుగులు నశిస్తాయని పేర్కొన్నారు. అలాగే ఉష్ణోగ్రత పెరగం వలన నేల పైపొరలో ఉన్న కార్బన్, నత్రజని నశించడంతో పంటకి ప్రధాన పోషకాలు అందవన్నారు. కార్బన్‌మోనాక్సైడ్, మిథెన్ లాంటి హానికర వాయువులు విడుదలవడం వలన శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాలను కలియదున్నినట్లయితే కార్బన్ శాతం, ఆర్గానిక్ పెరిగి నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెంపొందుతుందన్నారు. అవి కుళ్ళిపోవడానికి ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పెట్ లేదా వేస్ట్‌డికంపోజర్ దున్నిన అనంతరం చల్లినట్లయితే వరిగడ్డి కుళ్ళిపోయి సూక్ష్మజీవులు, మిత్రపురుగులు పంటకి మేలు చేస్తాయన్నారు.

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం డివిజనల్ వ్యవసాయ అధికారి పీ మహేష్ ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలను ఎరువులను వాడాలని సూచించారు. అంతేకాకుండా 60% సబ్సిడీతో వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలను పరిశీలించారు. ఈ విత్తనాలు రాయితీపై రైతులు పొందడానికి వ్యవసాయం విస్తరణాధికారి దగ్గర పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సబిహా, శ్రీలత పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళలు



- మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

నవతెలంగాణ-సిద్దిపేట

మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజాభివృద్ధిలో ముఖ్య భూమికను పోషిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, మగ్గం వర్క్స్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేట కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాల్లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంపిక చేసి, గ్రామీణ ప్రాంతాల యువతకు నైపుణ్య శిక్షణలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారు బ్యాంకు ద్వారా ఋణాలు తీసుకొని యూనిట్ ను స్థాపించాలని కోరారు. మెదక్, సిద్దిపేట నాబార్డ్ డీడీఎం కృష్ణ తేజ, నిఖిల్ రెడ్డిలు మాట్లాడుతూ దేశంలో ఉన్న ఆర్ఎస్ఈటిఐలు అన్ని యువత నైపుణ్య అభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తున్నాయన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడుతూ ఈ శిక్షణ కేంద్రాలు కేవలం నైపుణ్య కేంద్రాలే కాకుండా మానవ సంబంధాలు, వ్యాపార నిర్వహణ మెలకువలు కూడా నేర్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో అర్హులైన వారికి వివిధ పథకాల ద్వారా రుణాలు లీడ్ బ్యాంక్ ద్వారా ఇప్పిస్తానని తెలిపారు. సంస్థ డైరెక్టర్ రాజ లింగం మాట్లాడుతూ 2015 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 5000 మంది యువతకు వివిధ రకాల నైపుణ్య శిక్షణలు ఇచ్చి, వారిలో 70 శాతం మందికి వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని యూనిట్ ను స్థాపించుకున్నారని, సుమారు 85 శాతం మంది స్వయంగా స్వయం ఉపాధి ద్వారా స్థిరపడ్డారని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు మున్సిపల్ కమిషనర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది మొహమ్మద్ నజీమ్, నాగ రాజు, శ్రీనివాస్, స్వప్న, ప్రశాంత్, అరవింద్, కనకవ్వ పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు

- చివరి సర్వసభ్య సమావేశం



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన చివరి సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జడ్పీటీసీ కడ్తాల రవీందర్ రెడ్డి మండల పరిధిలోని పలువురు ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. జూన్ 3న ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుంది. మండల సర్వసభ్య చివరి సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశం ముగిసిన అనంతరం వీరంతా ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ ఐదేళ్ల అనుభవాలను, జ్ఞాపకాలను ఒకరినొకరు నెమరు వేసుకున్నారు. వైస్ ఎంపీపీ అస్క రవి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్, ఎంపీటీసీలు ఎల్.రామిరెడ్డి,ఆర్.మాధవి రెడ్డి,చిర్ర లావణ్య యాదగిరి, మమత రాధా మనోహర్ రెడ్డి, సంఘపు శోభ స్వామి, పొలబోయిన లక్ష్మీనారాగౌడ్, పరికి రవిగౌడ్, పలువురున్నారు.

5 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-నంగునూరు: ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 5 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, రాజగోపాలపేట పోలీసులు తెలిపారు. రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామ శివారులో మాలోత్ శంకర్ తన ఆటోలో 5 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిస్తున్నాడని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది, రాజగోపాలపేట పోలీసులు పట్టుకున్నారు. రాజగోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.